క్లుప్తంగా

నీటి కొరత రాకుండా చర్యలు

నంద్యాల(సిటీ): పట్టణ ప్రజలకు నీటి కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా ఉపయోగించుకుని నీటి కొరత రాకుండా ప్రణాళిక ప్రకారం ప్రజలకు నీటిని సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడైనా పైప్ లైన్ లీకేజీలు ఉంటే ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. అనంతరం 9వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

క్షుద్ర పూజల కలకలం



రెడ్డిపల్లె సమీపంలో క్షుద్ర పూజలు చేసిన దృశ్యం

రుద్రవరం: మండలంలోని రెడ్డిపల్లె-తువ్వపల్లె గ్రామాల మధ్య ఆదివారం తెల్లవారుజామున వివిధ ఆకారాల్లో ముగ్గులు, మద్యం సీసాలు, నిమ్మకాయలు,అలాగే అక్కడ ఏదో కాల్చేసిన ఆనవాళ్లు కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇలాగే కొద్ది రోజుల క్రితం ముత్తలూరు ప్రభుత్వ పాఠశాల వెనుక భాగంలో క్షుద్ర పూజల ఆనవాళ్లు కలకలం రేపాయి.

భోజనశాల ప్రారంభం



భోజనశాలను ప్రారంభిస్తున్న పూర్వవిద్యార్థులు

శిరివెళ్ల: మండలంలోని కోటపాడు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తమ వంతు విరాళాలు ఇచ్చిన దాతలను ఉపాధ్యాయులను సన్మానించారు. రూ.13 లక్షలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనశాల, ప్రాంగణంలో సరస్వతి దేవి విగ్రహ ఏర్పాటు, క్రీడా సామగ్రి, తరగతి గదులకు కటాంజనాల ఏర్పాటు చేయించారు. తాజాగా రూ.4లక్షలతో ఏర్పాటు చేసిన బోజనశాలను పూర్వ విద్యార్థులు రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మేర్వ పుల్లారెడ్డి, ప్రొఫెసర్ పార్వతి, సర్పంచు దూదేకుల ఉశేనబీ, మాజీ సర్పంచు కల్లూరి శకుంతలమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల్, రిటైర్డ్ ఏంఈఓ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాల్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. వేసవి సీజన్ ప్రారంభమైనందున ఎండలు పెరుగుతున్నాయని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

కుట్టుమిషన్లు, వీల్ చైర్స్ పంపిణీ



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు, చక్రాల కుర్చీలు పంపిణీ చేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): లయన్స్ సేవలు మరింత విస్తృతం చేస్తామని క్లబ్ జిల్లా గవర్నర్ నాగేశ్వరరావు యాదవ్ పేర్కొన్నారు. క్లబ్ నంద్యాల అధ్యక్షుడు పీవీ సుధాకర్ రెడ్డి, కార్యదర్శి సోమేశుల నాగరాజు, కోశాధికారి మామిళ్ల నాగరాజు ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం రూ.3లక్షల విలువైన కుట్టు మిషన్లు, వినికిడి యంత్రాలు, దివ్యాంగులకు చక్రాల కుర్చీలు పంపిణీ చేశారు. అలాగే మహానంది రోడ్డులోనున్న ఎయిం ఫర్ సేవ బాలికల ఛాత్రాలయంలో ఉన్న 50 మంది బాలికలకు రూ.3లక్షల విలువైన మోటార్‌తో పనిచేసే 15 కుట్టుమిషన్లు, 9 చక్రాల కుర్చీలు, కాస్మోటిక్స్ కిట్లు, విద్యా సామగ్రి అందజేశారు. రాష్ట్ర లయన్స్ సంస్థల మాజీ చైర్మన్ ఏవీఆర్ ప్రసాద్, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ రామరాజు పాల్గొన్నారు.



ఒకే ప్రాంగణంలో సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు



రైతుల సంక్షేమం కోసం నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం



నాడు-నేడుతో సర్వాంగ సుందరంగా ఎంపీ యూపీ స్కూల్




ఎస్సీకాలనీలో నిర్మించిన సీసీరోడ్డు

క్రిష్టిపాడు.. అభివృద్ధి తోడు

- గ్రామాభివృద్ధికి రూ.20కోట్లు వెచ్చింపు
- సచివాలయ వ్యవస్థతో పల్లెవాసులకు తప్పిన అవస్థలు
- సొంతూరిలోనే సంక్షేమ పథకాలు
- సర్కారు బడికి కొత్త హంగులు
- పల్లెముంగిట ఆధునిక వైద్య సేవలు

వైఎస్సార్‌సీపీ పాలనలో పల్లె మురుస్తోంది. ఇన్నేళ్లుగా అభివృద్ధికి దూరంగా నిలిచిపోయిన గ్రామాలు నేడు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయి. వివిధ ప్రభుత్వ కార్యాలయాల భవనాలు..ఆరోగ్య కేంద్రం.. దిగుబడులు భద్రపరుచుకునేందుకు గోదాము.. నూతన హంగులతో సర్కారు బడులు.. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ.. మండల కేంద్రం, ప్రధాన రహదారులకు కలిపే బీటీ రోడ్లు ఇలా అన్ని రకాల వసతులు సమకూరడంతో పల్లెసీమలు నూతన జవసత్వాలు నింపుకున్నాయి.



క్రిష్టిపాడు గ్రామం

దొర్నిపాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు అవుతుందని, అందులో పదుల సంఖ్యలో ఉద్యోగులు పని చేస్తారని ఊహించామా? ఆ ఊహలను నిజం చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. గ్రామ సచివాలయం, అనుబంధంగా రైతు భరోసా కేంద్రం, వ్యవసాయ గోదాము, ఆరోగ్య కేంద్రం, తదితర కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించి, ఆధునిక వసతులు కల్పించి, సిబ్బందిని నియమించడంతో పల్లెలు కొత్త కళను పులుముకున్నాయి. ఇక వలంటీర్లు ఇంటికే వచ్చి పథకాలు అందజేస్తుండటం గ్రామీణులకు కలగానే ఉంది. ఎన్నో ఏళ్లుగా మండల, నియోజకవర్గ కేంద్రాల చుట్టూ తిరగలేక అవస్థలు పడిన వారు.. ఒక్కసారిగా అవ్వా..తాతా.. అక్కా..అన్నా.. అంటూ పథకాలు అందజేస్తుంటే తాము ఇన్నేళ్లు పడిన ఇబ్బందులు తప్పడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పట్టణాలకే పరిమితమైన వైద్య సేవలు మారుమూల పల్లెల్లో సైతం ఉచితంగా అందుతున్నాయి. ఇక ఇన్నేళ్లుగా ఎరుగని సంక్షేమ పథకాలు గ్రామంలోని ప్రతి ఇంటికీ అర్హతన బట్టి అందజేస్తుండటంపై గ్రామీణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇంటింటికీ కుళాయి, వీధి దీపాలు తదితర వాటితో పల్లెలు విరాజిల్లుతున్నాయి.



గ్రామంలో జరిగిన భివృద్ధి పనులు... అందిన సంక్షేమ ఫలాలు

- ప్రభుత్వం ప్రవేశపెట్టిన 25సంక్షేమ పథకాలకు రూ.9.59 కోట్లు డీబీటీ ద్వారా గ్రామంలోని లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయి.



వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లో వైద్యసేవలు

- ఇళ్ల స్థలాలు, జగనన్న విద్యాకానుక, విద్యార్థులకు గోరుముద్ద, ట్యాబ్‌లు తదితర వాటి కోసం రూ.2.97 కోట్లు ఖర్చు
- రూ.40లక్షలతో 500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకునేలా బహుళ ప్రయోజన గోదాం నిర్మాణం
- రూ.42 లక్షలతో గ్రామ సచివాలయ భవనం ఏర్పాటు
- రూ.30లక్షలతో సర్కారు బడికి సరికొత్త హంగులు
- రూ.22లక్షలతో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం నిర్మాణం
- 17.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్
- ఓసీ, ఎస్సీ కాలనీల్లో రూ.11లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- ఓసీ, బీసీ, మైనార్టీ కాలనీల్లోరూ.4 లక్షలతో నూతన పైపులైన్ ఏర్పాటు చేయడంతో తాగునీటికి ఎద్దడి పరిష్కారం
- మైనార్టీ కాలనీల్లో రోడ్లపై పారుతున్న మురుగుతో ఇబ్బందులు గుర్తించి రూ.4 లక్షలతో డ్రైనేజీ వ్యవస్థ రూపకల్పన
- ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా మారడంతో రూ.3లక్షలతో విద్యుత్ లైన్ పునరుద్ధరణ
- ఎస్సీ, బీసీ, మైనార్టీ, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ముళ్ల పొదలను తొలగించి రూ.2 లక్షలతో గ్రావెల్ వేసి బాగు చేశారు.

సచివాలయ వ్యవస్థ సేవలు అద్భుతం



గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో సేవలు వేగంగా అందుతున్నాయి. ఏ సమస్య అయినా గ్రామంలోనే పరిష్కారం అవుతుంది. గతంలో పనులు మానుకొని మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. పొలం పట్టాదారుపాసు పుస్తకాని దరఖాస్తు చేయగానే ఒక్క రూపాయి తీసుకోకుండా ఇంటికే పోస్టుద్వారా పంపించారు.అన్ని రకాల సేవలు అందజేసేలా రూపకల్పన చేయడం అద్భుతం. అలాగే గ్రామంలో సంక్షేమం, అభివృద్ధి పనులు ఎన్నడూ చూడని విధంగా జరిగాయి. – చిన్నతిరుపాలు, క్రిష్టిపాడు

నా కుటుంబం ఎంతో అదృష్టం చేసుకుంది



పోలియో మహమ్మారి కారణంగా నా రెండు కాళ్లు పడిపోయి. నాకు భార్య, మా అమ్మకు ముగ్గురికి పింఛన్లు వస్తున్నాయి. అలాగే జగనన్న ప్రభుత్వం నాకు మూడు చక్రాల బైక్ ఉచితంగా ఇచ్చారు. మేము గతంలో పింఛన్లు తెచ్చుకోవాడానికి చాలా ఇబ్బందులు పడ్డాం. జగనన్న వచ్చాక వలంటీర్ వ్యవస్థతో ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారు. అర్హత కలిగిన పథకాలన్నీ అందుతున్నాయంటే మా కుటుంబం పుణ్యం చేసుకుందనే చెప్పాలి. – శ్రీనివాసులు, క్రిష్టిపాడు

ప్రభుత్వ చర్యలు బాగున్నాయి



గ్రామంలో నిర్మించిన సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే తదితర భవనాలను ఎంతో నాణ్యతగా, బాధ్యతగా నిర్మించాం. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేశాం. మండలంలో ఏ గ్రామంలో లేని విధంగా అభివృద్ధి పనులు చేశాం, ఇంకా చేస్తాం. మా గ్రామం అభివృద్ధిలో నేను భాగస్వామిని అయినందుకు గర్వపడుతున్నా. ఇవన్నింటికీ ప్రభుత్వ చర్యలే కారణం. – శివరామిరెడ్డి, సర్పంచి, క్రిష్టిపాడు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం



కోలాటమాడుతున్న మహిళలు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు మజరా గ్రామమైన మూడురాళ్లపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోఆదివారం విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పులినడిపి ఓబుళరెడ్డి హైదరాబాదులో స్థిరపడి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆయన గ్రామ సమీపంలోనున్న తన 5 ఎకరాల విస్తీర్ణంలో కొంత భాగంలో రూ.1.20 కోట్లు సొంతంగా వెచ్చించి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో విఘ్నేశ్వర, శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, సాయిబాబా, వీరభద్రస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాన్ని శుక్రవారం నుంచి మూడు రోజుల పాగు శాస్త్రోక్తంగా జరిపించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ కైప వేంకటనరసింహ్మశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ఆదివారం ఉదయం ప్రాతఃకాలపూజ, ప్రతిష్ఠాహోమం,అంగస్పర్శన హోమం, కర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, బింబ కళాన్యాసం, జ్వాలా దర్శనం, గోదర్శనం, బలిహరణం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, అన్న ప్రసాద వితరణ, అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణం చేపట్టారు.

అనుమతులు వచ్చేశాయ్



రుద్రవరం కలప డిపో నుంచి లారీలో వెదుర్లను బయటకు తరలిస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక కలప డిపో నుంచి వెదుర్లను బయటకు తరలించుకెళ్లేందుకు అవసరమైన అనుమతులు వచ్చేశాయి. దీంతో ఆదివారం డిపోలో సందడి నెలకొంది. కలప డిపోలో వెదుర్ల వేలం ముగిశాక అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు వాటిని తరలించుకునేందుకు సంబంధించిన అనుమతులు అటవీ శాఖ ఉన్నతాధికారుల నుంచి మూడు నాలుగు రోజుల్లో వచ్చేవి. అయితే ఈ ఏడాది 11 రోజులు దాటినా రాకపోవడంతో ఈ నెల 17న 'సాక్షి'లో 'అనుమతులు ఆలస్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనానికి అధికారులు స్పందించి అనుమతులు మంజూరు చేశారు. ఆ వెంటనే కాంట్రాక్టర్లు వేలంలో దక్కించుకున్న వెదుర్లను లారీల్లో తరలించడం ప్రారంభించారు. అలాగే డిపోలో చిందర వందరగా పడి ఉన్న వెదుర్లను కూలీలు తరగతుల వారీగా విభజింజి లాట్లుగా పేర్చుతున్నారు.

ఈరోజు

మండల మీట్

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురాం ఆదివారం తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో ఉదయం 10:30 గంటలకు హాజరు కావాలని కోరారు.

స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అక్కడ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై అర్జీలు సమర్పించాలని కోరారు.

నివర్తినగర్‌లో 'మన ఊరు–మనవాడ'

నంద్యాల(అర్బన్): పట్టణంలోని నివర్తినగర్‌లో ఆదివారం ఏపీ ఎరుకల సమైక్య సంస్థ ఆధ్వర్యంలో మన ఊరు–మనవాడ కార్యక్రమం నిర్వహించారు. సమైక్య సంస్థ చైర్మన్ రామలింగడు, అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో సంస్థ సభ్యులతో కలిసి మురుగు కాల్వలు, రహదారులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎరుకల కాలనీల అభివృద్ధే సమైక్య సంస్థ ధ్యేయమన్నారు. ఇందుకు జిల్లాలోని ఎరుకల కాలనీలను ఎంపిక చేసుకొని కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు నాగార్జున, కార్యదర్శి శేఖర్, సభ్యులు చంద్రశేఖర్, లింగమయ్య, రాజు, రాజనాల, నారాయణ, సాలన్న పాల్గొన్నారు.

డబ్ల్యూ గోవిందిన్నెలో అగ్నిప్రమాదం

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ఆదివారం అగ్నిప్రమాం చోటుచేసుకుంది. బిజినవేములలో చంద్రశేఖర్ అనే వ్యక్తి గడ్డివామి, నివాసం ఉండేందుకు రేకులషెడ్డును ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసుకున్నాడు. మధ్యాహ్నం సమయంలో గాలులు వీయడంతో విద్యుత్ తీగలు రాపిడికి గురై నిప్పులు చెలరేగి గడ్డివామిపై పడ్డాయి. వెంటనే మంటలు షెడ్డులోకి వ్యాపించడంతో ఇంట్లోని ధాన్యం, తిండిగింజలు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. గమనించిన ఇరుగు పొరుగు వారు నాలుగు పాడిగేదెలను తప్పించారు. గ్యాస్ సిలిండర్‌కు మంటలు వ్యాపిస్తే పెనుప్రమాదం చేటుచేసుకుంటుందని చంద్రశేఖర్ భార్య లక్ష్మిసాయి మంటల్లోనే ఇంట్లోకి దూసుకెళ్లింది అయితే పొగ కమ్ముకుపోవడంతో లోపలే ఉండిపోయింది. గమనించిన స్థానికులు ఇంట్లోకి వెళ్లి రక్షించారు.





గాయలపాలైన లక్ష్మిసాయి, కాలిపోయిన సామగ్రి

అప్పటికే ఆమెకు కాలినగాయాలయ్యాయి. అలాగే చంద్రశేఖర్ తండ్రి చిన్నన్నకు స్వల్పయాలయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ.3లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని వారు విలపించారు. కాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు చంద్రశేఖర్ వెళ్లగా సమాచారం ఇచ్చారు. ఆళ్లగడ్డ, నంద్యాల అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం





ప్రత్యేక అలంకరణలో వీరభద్ర స్వామి, గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బైర్మల్ వీధిలో ఉన్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం 21 వార్షికోత్సవాన్ని ఆలయ పురోహితులు సాంబయ్య స్వామి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, అర్చనలు తదితర విశేష పూజలు జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా వీరశైవులు ప్రదర్శించిన నందికోలు సేవ, ఖడ్గ ఉచ్చారణ అలరించాయి. ఈశ్వరప్ప, రాజు, శ్రీనివాసులు, నాగేంద్ర, శంకరప్ప, సురేష్, మల్లికార్జున, వీరభద్రప్ప పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు.

అడుగులన్నీ రాప్తాడు వైపే

- సిద్ధం' సభకు తరలిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు
- వాహనాల బారులతో కిక్కిరిసిన అనంతపురం రోడ్లు
- దాడిపాడవునా జై..జగన్ నినాదాలు



ఉయ్యాలవాడ నుంచి బయలుదేరుతున్న నాయకులు, కార్యకర్తలు

ఉయ్యాలవాడ : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు ఉయ్యాలవాడ మండలం నుంచి 11 వాహనాల్లో వైఎస్సాఆర్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి పిలుపు మేరకు తరలివెళ్లారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ ఉత్సాహంతో పార్టీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ లాలమ్మ గారి హుసేనయ్య (బుజ్జి), సింగిల్‌విండో అధ్యక్షులు పోచా వెంకటరెడ్డి, పల్లె మహేశ్వరరెడ్డి తదితరులు తరలివెళ్లారు.

రుద్రవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు,అభిమానులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి 20 బస్సుల్లో తరలి వెళ్లారు.

దొర్నిపాడు: అనంతపరం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం సభకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు భారీగా తరలి వెళ్లారు.

చాగలమర్రి: రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు మండలం నుండి భారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్ బాబూలాల్, పార్టీమండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, పార్టీ ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా మాట్లాడుతూ 2 వేల మందికి పైగా వెళ్తున్నట్లు తెలిపారు.

శిరివెళ్ల: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభకు మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలోని కార్యకర్తలు తరలి వెళ్లారు.



శిరివెళ్ల మండల కార్యకర్తల ఆనందోత్సవాలు





చిత్రేనిపల్లె సచివాలయం నుంచి వెళ్తున్న దృశ్యం,



క్రిష్టిపాడు నుంచి బయలు దేరుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులు, వివిధ వాహనాల్లో ఉదయం నుంచే బయలు దేరారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి తదితరులు వెళ్లారు.



చాగలమర్రి నుంచి తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు